క్లుప్తంగా

ఎస్‌ఐగా రామకృష్ణ బాధ్యతలు



మానవపాడు: మండలంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐగా రామకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌ను జిల్లా వీఆర్‌కు బదిలీ చేయగా, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను మండలానికి బదిలీ చేసినట్లు తెలిపారు.

చదువుకుంటేనే మంచి భవిష్యత్

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని, చదువుకుంటూనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం చాగదోనలో ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలసి బడిబాట పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో శంకరన్న, బుడ్డప్ప, కృష్ణగౌడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ధరూరు: మండల కేంద్రంలోని కొండేటి హనుమన్న (ఆంజనేయ స్వామి) ఆలయానికి ఎంపీటీసీ డీఆర్ శివలీల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ దంపతులు రూ.లక్ష చెక్కును ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈదన్న, పెద్ద కిష్టన్న, నాగరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

పేదల గుండెల్లో కేసీఆర్ కొలువయ్యారు..

అయిజ: రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటూ ముఖ్య మంత్రి కేసీఆర్ పేద ప్రజల గుండెల్లో కొలువయ్యారని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం పట్టణంలోని భరత్‌నగర్‌లో శ్రీకర్‌గౌడ్ నివాసానికి వెళ్లి సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యం బారినపడి ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని 100 పడకల ఆస్పత్రి నిర్మాణంకోసం అహర్నిశలు కృషిచేసి సాధించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

రాజోళి: మండల కేంద్రంలోని గణేష నగర్ కాలనీలో ఆదివారం 9గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 7గంటలకు పోయిన కరెంట్ సాయంత్రం 3:45 గంటలకు వచ్చిందని, దీంతో చాలా ఇబ్బందులు పడ్డామని కాలనీవాసులు వాపోయారు. ఏరువాక పౌర్ణమి కావడంతో, పండుగ సందర్భంగా చేసుకోవాల్సిన ప్రత్యేక కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, ఇబ్బందులు పడుతూనే పండుగను చేసుకున్నామని తెలిపారు. కరెంట్ విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే అసలు స్పందించకపోగా, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని కాలనీ వాసులు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గ్రామ దేవత ఆలయం ప్రారంభం



గట్టు: మండల పరిధిలోని బల్గెరలో కొత్తగా నిర్మించిన గ్రామ దేవత మారెమ్మవ్వ ఆలయాన్ని ఆదివారం సర్పంచ్ హనుమంతునాయుడు ప్రారంభించారు. ఏరువాక పండుగ రోజు గ్రామస్తులంతా కలిసి దేవతల విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా దేవాలయం వరకు తీసుకెళ్లారు.

కేసులు పెట్టడం అమానుషం

శాంతినగర్: కేసులు పెట్టి అక్రమ అరెస్టులు చేయించడం అమానుషమని తెలంగాణ క్రాంతిదళ్ నాయకుడు నాగేష్‌యాదవ్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గంలో చిన్న సమస్యను పెద్ద బూచిగా చూపించి రంజిత్‌కుమార్ కార్యాలయంపై దాడిచేయడం దురదృష్టకరమన్నారు. రాజకీయంగా ఎదగరాదనే ఆలోచన చేస్తూ అనేక అవరోధాలు సృష్టిస్తున్నారన్నారు. పోలీసులు సైతం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇరువర్గాలు ఫిర్యాదు చేసినా కనీసం విచారణ చేయకుండా రంజిత్‌కుమార్, ఆయన అనుచరుల మీద అనేకమైన సెక్షన్లు పెట్టి కేసులు నమోదుచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వీరేష్, రాముడు, రాంరెడ్డి, వినోదాచారి, ఈశ్వర్, రామాంజి, శివన్న పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో ఏరువాక సంబరాలను రైతులు, ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాడెద్దులను రంగులతో అలంకరించి ఊరేగింపు గావించారు.

కాడెద్దులు, గ్రామదేవతలకు పూజలు..

గట్టు: ముంగారి సేద్యం ప్రారంభంలో రైతులు చేసుకునే అతి పెద్ద పండుగ ఏరువాక పౌర్ణమి. ఆదివారం రైతులు ఆనందోత్సవాల మధ్య ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని రైతులు కోరుకుంటూ దేవతలకు నైవేద్యాలను సమర్పించుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గొల్లకురుమలు గ్రామంలో కుంభం కాగుతో ఊరేగింపుగా వెళ్లి సుంకులమ్మకు మొక్కులను చెల్లించుకున్నారు.

కేటీదొడ్డి: మండలంలోని చింతకుంటలో బండ లాగుడు పోటీలకు జెడ్పీటీసీ రాజశేఖర్ ప్రారంభించారు.

మల్దకల్: మండలంలో ఏరువాకపౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పిండి వంటకాలను తయారుచేసి సుంకులమ్మ, సవారమ్మ ఈదమ్మ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అయిజ: మండల కేంద్రంలో, గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో సుంకలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉదయం నుంచే సందడి నెలకొంది. ప్రజలు ఉదయం నుంచే గ్రామ దేవతల ఆలయాలకు బారులు కట్టారు. నైవేద్యాలతో, కొబ్బరికాయలతో అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగతో పాటు, తెలంగాణ అవతరణ ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో గ్రామ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు.



జిల్లా కేంద్రంలో సుంకులమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఎద్దులతో తోరణాలను రైతులు తెంపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని గ్రామాలలో ఆదివారం ఏరువాక సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పాడిపశువులను పూజించి ఆనందోత్సవాల నడుమ గ్రామాలలోని రైతులు ఉదయం అరక దున్నడంను ప్రారంభించారు. సాయంత్రం రైతులు సుంకులమ్మకు బోనాలలో ప్రత్యేక నైవేద్యం వండి గ్రామస్తులతో సమూహంగా వెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మునుగాలలో క్రికెట్ టోర్నీని నిర్వహించారు.

ధరూరు: మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పేరులో గ్రామస్తులు సమీపాన ఉన్న కృష్ణానదిలో పుష్కర ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



చెన్నిపాడులో ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



కంచుపాడు ఆలయంలో భక్తుల పూజలు



ఈడుగోనిపల్లిలో ఎద్దులతో ఊరేగిస్తున్న రైతులు



కేటీదొడ్డిలో..



రాజోళిలో..



షేకుపల్లిలో సుంకులమ్మ గుడికి వెళ్తున్న మహిళలు



ఉండవెల్లిలో ఎద్దులతో తోరణాలను తెంపుతున్న రైతులు

ఘనంగా ఆదిశిలావాసుడి కల్యాణం

మల్దకల్: ఆదిశిలాక్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య నిర్వహించారు. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని ఆవరణలోని మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు వేదపండితులు, అర్చకులు పూజలు నిర్వహించి హోమాలు చేశారు. అంతకుముందు స్వామి వారి ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.



ఆదిశిలావాసుడి కల్యాణోత్సవంలో వేదపండితులు

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న నాయకులు

కేటీదొడ్డి: మండలంలోని సోంపురంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలు, ఎద్దుల గిరక పోటీలను సర్పంచ్ తిక్కన్న హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగపూట పోటీలను నిర్వహించడంతో ప్రజలకు ఆహ్లాదాన్ని నింపడంతో పాటు రైతుల మధ్య సమైక్యభావం పెరుగుతుందన్నారు. అనంతరం గెలుపొందిన ఎద్దులను ఊరేగించారు. మొదటి బహుమతి రూ.3,500, రెండో బహుమతి రూ. 3వేలు, మూడవ బహుమతి రూ.1500 అందజేశారు. గువ్వలదిన్నెలో ఎద్దుల గిరక పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.4వేలు, నాల్గవ బహుమతి రూ.3వేలు అందజేశారు.

రన్నింగ్ పోటీలో..

మండలంలోని వెంకటాపురంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన 2కిలో మీటర్ల పరుగు పందెం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి వీరేష్, రెండో బహుమతి హరికృష్ణ, మూడో బహుమతి రంగస్వామి గెలుపొందారు.

పోలీస్ వ్యవస్థకు ఏం చేశారో చెప్పాలి



ఎర్రవల్లిచౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం పోలీస్ వ్యవస్థకు ఏం న్యాయం చేశారో సమాధానం చెపాల్సని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎం.జి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు లేకుండా ఎమ్మెల్యేలు, మంత్రులు బయటకు రాగలరా అని ప్రశ్నించారు. పోలీసులతో నిరంతరం వెట్టి చాకిరి చేయించుకుంటూ కనీసం టీఏ, డీఏలు కూడా సక్రమంగా ఇవ్వడంలేదని మండిపడ్డారు. 2009, 2012 బ్యాచ్‌లకు చెందిన ఎస్‌ఐలకు నేటికి పదోన్నతులు ఇవ్వలేదన్నారు. పోలీస్ వ్యవస్థకు పదేళ్లలో ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేశారో సమాధానం చెప్పాలన్నారు. అన్ని రంగాల్లో పోలీసులను మోసం చేస్తూ.. తిరిగి పోలీసులతోనే ప్రభుత్వం ఉత్సవాలను చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో మహేష్, మధుగౌడ్, మణికుమార్, సుంకన్న, మోహన్‌రాజ్, తిరుపాల్, ఉపేందర్, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ధరూరులో భారీగా ఈదురుగాలులు

ధరూరు: మండలంలో ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పాటు మోస్తరు వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపి వేసిన అధికారులు రాత్రి 9:30 గంటలకు తిరిగి పునరుద్ధరించారు. సాయంత్రం వరకు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ జనం స్వల్పంగా కురిసిన వర్షంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉన్న వాతావరణం, సాయంత్ర 4 గంటల నుంచి ఎండ దంచి కొట్టింది.

రథోత్సవం

రాజోళి: మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో రథాన్ని అలంకరించి, స్వామి, అమ్మవార్లను రథంలో ఆశీనులు చేశారు. ఆలయం నుంచి ఊరేగింపు చేస్తూ భక్తుల కోలాహంతో గ్రామంలో తిరిగారు.



వట సావిత్రివ్రతం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సుదాపండితులు సత్యప్రియ ఆచార్యులు వట సావిత్రీ వ్రతాన్ని వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ వీహెచ్‌పీ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో విజయ ధ్వజారోహణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

లక్ష్యం మరిచారు..?

- నిరుపయోగంగా యాపిల్ హోం ఫీడ్ ద నీడ్ కేంద్రం రిఫ్రిజిరేటర్
- అందుబాటులోకి తీసుకురావాలంటున్న పేదలు

గద్వాల అర్బన్: ఆహారం వృథాకాకుండా చేయాలనే సదుద్దేశంతో పట్టణంలో యాపిల్ హోం ఫీడ్ ద నీడ్ రిఫ్రిజిరేటర్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ఫ్రీజర్ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. దీన్ని పట్టించుకోకుండా గాలికొదిలేసి లక్ష్యాన్ని మరిచారు.

నిరుపయోగంగా రిఫ్రీజిరేటర్..

నిరాశ్రయులు, యాచకులు, అనాథలు, రోగుల సహాయకులకు 24గంటల పాటు ఆహారం అందుబాటులో ఉండాలని, ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదనే ఉద్దేశ్యంతో 2019లో పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద యాపిల్ హోం ఫీడ్ ద నీడ్ పేరుతో మున్సిపాలిటీ సహకారంతో పెద్ద రిఫ్రీజిరేటర్ ఉంచారు. ఇది ప్రారంభంలో చాలా మంచి ఆదరణ చూరగొంది. రానురాను వాటి నిర్వహణలో నిర్లక్ష్యం, ఇతర కారణాలతో అలంకారప్రాయంగా మారింది.



గద్వాల పట్టణంలో కొత్తబస్టాండ్ వద్ద నిరుపయోగంగా రిఫ్రిజిరేటర్

పట్టణ వాసులు ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, వివాహ, పుట్టిన రోజు తదితర శుభకార్యాల్లో మిగిలిన ఆహారం, ఇతర తినే పదార్థాలు ఈ ఫ్రీజర్‌లో పెట్టేవారు. అవసరమైన వారు వాటిని తీసుకుని వెళ్లేవారు. దీంతో మెల్లమెల్లగా నిరాశ్రయులు, యాచకులు, అనాథలతో పాటు ఆహారం అవసరమైన వారికి దూరమైంది. మున్సిపాలిటీ, సంబంధిత సంస్థ సభ్యులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నానోజైమ్ గుళికలతో అధిక దిగుబడి



ఎర్రవల్లిచౌరస్తా: నానోజైమ్ గుళికలతో అధిక దిగుబడి వస్తుందని ఏరియా సేల్స్ అధికారి అంకినీడు తెలిపారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఇంజన్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం నానోజైమ్ శుభారంభం క్యాంపెయిన్‌ను ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో కేక్ కట్‌చేసి ప్రారంభించారు. సేల్స్ అధికారి మాట్లాడుతూ సముద్రపు నాచు నుంచి తయారు చేసిన నానోజైమ్ గుళికలలో సిలికాన్ ఉన్నందున వ్యవసాయ రంగలో వీటి విశిష్టత ఎంతగానో ఉందన్నారు. అన్ని రకాల పంటల్లో వాడటం వల్ల అధిక పిల్ల వేర్లతో పాటు తెల్ల వేరు వ్యవస్థ సత్వరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డీలర్ శ్రీనివాస్, పరశురాముడు, రైతులు ఉన్నారు.

దేవునికి ఇష్టంగా జీవించాలి



ధరూరులో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ధరూరు: ప్రతి ఒక్కరూ దేవునికి ఇష్టకరంగా జీవించాలని రెవ పాస్టర్ నరేష్‌పాల్ అన్నారు. మే నెల మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులను ఉద్దేశించి ఆయన బైబిల్ ప్రవచనాల ఆధారంగా బోధించారు. సర్వలోక సృష్టికర్త అయిన ఏసుక్రీస్తును పోలిన జీవితాన్ని కలిగి ఉండాలని అన్నారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో నడవాలని కోరారు. సంఘానికి, సమాజానికి కట్టుబడి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సీమోను, సత్యన్న, డేవిడ్, దానియేలు, ఎజ్రా, యోబు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లను ఆదుకోవాలి

గద్వాల అర్బన్: వీరశైవ లింగాయత్‌లు ఆర్థికంగా వెనుబాటుకు గురయ్యారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వీఎల్‌పీ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ డిమాండ్ చేశారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం సముచిత స్థానం కల్పించి న్యాయమైన డిమాండ్లను సాధనకు ఆదివారం హైదరాబాద్‌లో తలపెట్టిన వీరశైవ లింగాయత్‌ల మహార్యాలీకి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు.



మహార్యాలీకి తరలివెళ్తున్న వీరశైవ లింగాయత్‌లు

వాగుపై వంతెన నిర్మించండి

- 2003లో శంకుస్థాపన
- ఇప్పటి వరకు ప్రారంభంకాని పనులు

అయిజ: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రోడ్లుతోపాటు వాగులు, వంకలపై వంతెనలు, కల్వర్టులు నిర్మించాలి. రోడ్లు నిర్మించినా వంతెనలు, కల్వర్టులు నిర్మించకుంటే ప్రయాణానికి ఆటంకం కలుగుతుంది. ఇలాంటి పరిస్థితిని మండలంలోని దేవబండ, ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి ప్రజలు ఎదుర్కొంటున్నారు.

శంకుస్థాపనకే పరిమితం ..

ఎక్లాస్‌పురం, అయిజ, దేవబండ మధ్యనున్న పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించాలని 18ఏళ్ల క్రితం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టలేదు. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించమని అధికారులు, నాయకులతో ప్రజలు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా అరణ్య రోదనలాగే మిగిలిపోయింది. దేవబండ ప్రజలు వారి అవసరాలు తీర్చుకునేందుకు నిత్యం మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దేవబండకు అయిజ మధ్య ఉన్న పెద్దవాగుకు వంతెన లేకపోవడంతో వర్షాకాలం ప్రజలకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయి. నీటిప్రవాహం తగ్గేంతవరకు ఏగ్రామంలోని ప్రజలు అక్కడే ఉండే పరిస్థితి నెలకొంటుంది.

బుట్టదాఖలైన విన్నపాలు

2003లో అప్పటి ఎమ్మెల్యే గట్టు భీముడు రూ.15 లక్షల అంచనాలతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం చేయలేదు. 2005లో అప్పటి చిన్న పరిశ్రమల శాఖ మంత్రి డీకే అరుణకు గ్రామ ప్రజలు వినతిపత్రం అందించారు. 2011లో అప్పటి కలెక్టర్ పురుషోత్తం రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. 2012లో ఎమ్మెల్యే అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. 2013లో కూడా అప్పటి ఎంపీ మందజగన్నాథంకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి దేవబండ బ్రిడ్జి నిర్మాణంకు నిధులు మంజూరుచేసి నిర్మాణం పనులు చేప్పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దేవబండ వాగుపై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

ప్రతిపాదనలు పంపించాం..



దేవబండ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గతంలో అనేకసార్లు అధికారులు ప్రతిపాదనలు పంపారు. 4ఏళ్ల క్రితం మళ్లీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. ప్రజల కోరిక మేరకు మళ్లీ నివేదికలు పంపుతాం.

– ఆంజనేయుడు, పంచాయతీరాజ్ డీఈ